సాక్షి పార్వతీపురం మన్యం

బుధవారం । 14 । ఫిబ్రవరి । 2024



పంట రుణపరిమితి పెంపు

ప్రభుత్వం పంట రుణపరిమితిని పెంచింది. రైతులకు ఆర్థిక తోడ్పాటునందిస్తోంది.

-8లో



శంబరలో బారులు తీరిన భక్తులు

శంబర పోలమాంబ అమ్మవారి జాతర వైభవంగా జరిగింది. అమ్మవారి దర్శనానికి భక్తులు పోటెత్తారు.

- 8లో

15న పదోన్నతుల కౌన్సెలింగ్

పార్వతీపురం: గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు ఈనెల 15న స్థానిక ఐటీడీఏ గిరిమిత్ర సమావేశ మందిరంలో పదోన్నతుల కౌన్సెలింగ్‌కు సంబంధించి ధ్రువీకరణ పత్రాలు పరిశీలిస్తామని ఐటీడీఏ ఉపసంచాలకులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సెకెండ్ గ్రేడ్ సమాన కేటగిరీ ఉపాధ్యాయులకు పాఠశాల సహాయకులుగా పదోన్నతులు కల్పించేందుకు కన్నర్స్‌డు సీనియారిటీ జాబితాను ఆయా పాఠశాలల హెచ్‌ఎంల ద్వారా పంపిస్తామన్నారు. ఈ మేరకు ఈనెల 15న కౌన్సెలింగ్ నిర్వహిస్తామని చెప్పారు.

న్యూస్‌రీల్

ఆపన్న హస్తం



బాధితునికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందజేస్తున్న పాలవలస విక్రాంత్, రాజశేఖరం, తదితరులు

పాలకొండ రూరల్: బాధిత కుటుంబాలకు జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఆపన్న హస్తం అందిస్తోందని శాసనమండలి విప్, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ అన్నారు. పాలకొండ మండలం వాటపాగు గ్రామానికి చెందిన వారాడ సంజీవినాయుడు కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. విషయం ప్రభుత్వానికి నివేదించడంతో సీఎం సహాయనిధి నుంచి రూ.లక్షా50వేలు మంజూరైంది. సంబంధిత చెక్కును బాధితునికి ఎమ్మెల్సీ మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకుడు పాలవలస రాజశేఖరం, సర్పంచ్ వావిలపల్లి రాజారావు, నాయకులు దవళేశ్వర రావు, కోట అజేయ్‌కుమార్, వారాడ జగన్, సంజీవినాయుడు, దుర్గారావు, చిన్నంనాయుడు, భాగ్యరత్నం, ఎస్.సాంబినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

స్ప్రేయింగ్ ప్రక్రియ పరిశీలన



దోమల నివారణ మందును పిచికారీని పరిశీలిస్తున్న డీఎంఓ జగన్‌మోహన్‌రావు

కురుపాం: మలేరియా దోమల వ్యాప్తి నివారణకు స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో మలేరియా సబ్‌యూనిట్ అధికారి ఎస్.నారాయణరావు ఆధ్వర్యంలో మంగళవారం స్ప్రేయింగ్ ప్రక్రియ చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా మలేరియా అధికారి (డీఎంఓ) డాక్టర్ టి.జగన్‌మోహన్‌రావు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వసతిగృహాల్లో దోమలు వ్యాప్తి చెందకుండా, విద్యార్థులు జ్వరాల బారిన పడకుండా ఉండేందుకు ముందస్తు చర్యల్లో భాగంగా ఫోకల్ స్ప్రేయింగ్ చేపట్టినట్లు చెప్పారు. ఇందుకు గాను ఆల్ఫా సైపర్ మైత్రిన్(ఏసీఎం 5శాతం) దోమల నివారణ మందును పిచికారీ చేయించామని తద్వారా స్ప్రేయింగ్ చేపట్టిన ప్రదేశాల్లో మలేరియా దోమలు స్థావరాలను ఏర్పరుచుకోలేవని ధైర్యం చెప్పారు. ఈ మందు ప్రభావం రెండు నెలల వరకు ఉంటుందని తెలిపారు. విద్యార్థులకు మలేరియా. డెంగీ, సీజనల్‌వ్యాధులపై అవగాహన కల్పించారు. విద్యార్థుల నుంచి రక్తనమూనాలను సేకరించి పరీక్షలు చేపట్టారు. కార్యక్రమంలో ఏఎంఓ సూర్యనారాయణ, కేజీబీవీ ప్రత్యేకాధికారిణి ఇంటికుప్పల కిరణ్‌కుమారి, వైద్యసిబ్బంది మురళీకృష్ణ, ప్రత్యూష, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

సత్తా చాటాలి

- జిల్లా బీసీ సంక్షేమశాఖాధికారి ఎస్.కృష్ణారావు

పార్వతీపురంటౌన్: జిల్లాలో వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ వసతిగృహాల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులు పబ్లిక్ పరీక్షల్లో సత్తా చాటాలని జిల్లా బీసీ సంక్షేమశాఖాధికారి ఎస్.కృష్ణ అన్నారు. జిల్లాలో బీసీ సంక్షేమ వసతిగృహాల్లో పదోతరగతి చదువుతున్న విద్యార్థులకు పబ్లిక్ పరీక్షలపై మంగళవారం పార్వతీపురం ఉన్నత పాఠశాలలో పునశ్చరణ తరగతులు నిర్వహించారు. పబ్లిక్ పరీక్షల్లో అనుసరించే మెలకువలను తెలియజేశారు. విద్యార్థులు మంచి మార్కులు సాధించి ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, జిల్లాకు పేరు తీసుకురావాలన్నారు. గణితశాస్త్రం, భౌతిక శాస్త్రం, ఆంగ్ల సబ్జెక్టుల్లో సందేహాలను ఎప్పటికప్పుడు నివృత్తిచేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏబీసీ డబ్ల్యూఓ ఎస్.సాంబమూర్తి, జిల్లా వసతిగృహాల వార్డెన్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ముక్తికాంత్ మిశ్రాకు డాక్టరేట్



డాక్టరేట్ అందుకున్న ముక్తికాంత్ మిశ్రా (మధ్యలో ఉన్నవ్యక్తి)

పర్లాకిమిడి: స్థానిక సెంచూరియన్ వర్సిటీ చైర్మన్ డా.ముక్తికాంత మిశ్రాకు ఆస్ట్రేలియాకు చెందిన డైకిన్ విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రదానం చేసింది. గత పదిహేనేళ్లుగా సెంచూరియన్ వర్సిటీ ఆస్ట్రేలియాలో ఉన్నటువంటి డైకిన్ వర్సిటీతో వివిధ కోర్సుల్లో భాగస్వామిగా ఉంది. దీనిలో భాగంగా సెంచూరియన్ వర్సిటీలో ఉన్నత విద్య, స్కిల్ డవలప్‌మెంట్, సామాజిక అంశాలైన గ్రామ్‌తరంగ్ వంటివి అభివృద్ధి చేసిన చైర్మన్ డాక్టర్ ముక్తికాంత మిశ్రాకు డాక్టరేట్ అందజేసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అవార్డుతో తన బాధ్యత మరింత పెరిగిందన్నారు. ఆయనకు వర్సిటీ ఉపాధ్యక్షుడు ఆచార్య డి.ఎన్.రావు, వీసీ డాక్టర్ సుప్రియా పట్నాయక్, డీన్ డా.అనితా పాత్రో, డాక్టర్ దేవేందర్ రెడ్డి అభినందనలు తెలిపారు.

జేఎన్‌టీయూ–జీవీ...

ప్రగతిపథం



సమావేశంలో మాట్లాడుతున్న విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ

- యూనివర్సిటీగా అప్‌గ్రేడ్‌తో పలు అభివృద్ధి పనులు
- బాలికలకు అందుబాటులోకి మూడో వసతిగృహం
- రెండు ల్యాబ్‌లకు సమకూరిన భవనాలు



హాజరైన విద్యార్థులు



కొత్తగా నిర్మించిన ల్యాబ్

సాక్షి ప్రతినిధి, విజయనగరం: విద్యల నగరంగా పేరొందిన విజయనగరానికి జేఎన్‌టీయూ–గురజాడ విజయనగరం (జీవీ) మణిహారంగా రూపుదిద్దుకుంటోంది. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం దీనిని యూనివర్సిటీగా అప్‌గ్రేడ్ చేసిన తర్వాత అందుకు తగ్గట్లుగా పలు అభివృద్ధి పనులకు నాంది పలికారు. బాలికలకు మూడో వసతిగృహం అందుబాటులోకి వచ్చింది. రెండు ల్యాబ్‌లకు భవనాలు సమకూరాయి.

తొలుత ఇంజినీరింగ్ కళాశాలగా ఉన్న జేఎన్‌టీయూ ప్రాంగణాన్ని జేఎన్‌టీయూ–జీవీ యూనివర్సిటీగా ప్రభుత్వం అప్‌గ్రేడ్ చేసిన తర్వాత ఏడాది కిందటే వైస్‌చాన్సలర్‌ను నియమించింది. మరోవైపు యూనివర్సిటీ విస్తరణకు అవసరమైన మౌలిక సదుపాయాలు, భవన నిర్మాణాలకు సంబంధించిన అభివృద్ధికి ప్రణాళికలు రచించారు. అందులో భాగంగా నిర్మాణ పనులు పూర్తయిన బాలికల వసతిగృహం, మెటలర్జికల్ ఇంజినీరింగ్ ల్యాబ్, సివిల్ ఇంజినీరింగ్ ల్యాబ్ భవనాలను మంగళవారం విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ ప్రారంభించారు. వీసీ లాంజ్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు.

రెండు విభాగాల ల్యాబ్ భవనాల విస్తరణ

ప్రధానమైన కోర్సుల వారికి ల్యాబ్‌లు ఉన్నా ప్రస్తుతం ఉన్న విద్యార్థుల సంఖ్యకు తగ్గట్లుగా లేవు. గత కొన్నేళ్లుగా పరిశోధన, బోధనలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇందుకు పరిష్కారంగా మెటలర్జికల్ ఇంజినీరింగ్ ల్యాబ్ భవనానికి రూ.1.25 కోట్లు, సివిల్ ఇంజినీరింగ్ ల్యాబ్ భవనానికి రూ.1.25 కోట్లు జేఎన్‌టీయూ కాకినాడ యూనివర్సిటీ యాజమాన్యం మంజూరు చేసింది. నిర్మాణ పనులు పూర్తయిన ఈ భవనాలను మంత్రి బొత్స సత్యనారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగానే మరో రూ.3.80 కోట్లతో ప్రతిపాదించిన యూనివర్సిటీ వైస్ చాన్సలర్ లాంజ్ నిర్మాణానికి మంత్రి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో కలెక్టర్ జి.నాగలక్ష్మి, జేఎన్‌టీయూ జీవీ వీసీ ప్రొఫెసర్ కె.వెంకటసుబ్బయ్య, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి.జయసుమ, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె.శ్రీకుమార్, తదితరులు పాల్గొన్నారు.

రూ.17.99 కోట్లతో అకడమిక్ భవనాల విస్తరణ

యూనివర్సిటీ ప్రాంగణంలో ఇప్పటికే ఉన్న రెండు అకడమిక్ భవనాలు సరిపోవడం లేదు. విధుల నిర్వహణ పెద్ద సమస్యగా ఉందని యూనివర్సిటీకి ప్రతిపాదనలు పంపినా గత ప్రభుత్వంలో పాలకులు పట్టించుకోలేదు. ఈ నేపథ్యంలో వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం మరో బ్లాక్ నిర్మించడానికి అనుమతులు ఇచ్చింది. జేఎన్‌టీయూ–కాకినాడ యాజమాన్యం నుంచి ఈ మేరకు నిధులు రూ.17.99 కోట్లు కేటాయించింది. ప్రస్తుతం ఈ భవనం నిర్మాణ దశలో ఉంది.

రూ.1.20 కోట్లతో ఓవర్ హెడ్ ట్యాంక్

యూనివర్సిటీకి అవసరమైన తాగు, వినియోగపు నీటి సౌకర్యాల పెంపునకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఇప్పటికే ప్రాంగణంలో ఉన్న ఏర్పాట్లతో విభాగాల వారీగా మోటార్లతో తోడి అందిస్తున్నారు. దీనికి బదులుగా గ్రావిటీతో నీరు అందించేలా సమీపంలోని కొండ మీద ఓవర్‌హెడ్ ట్యాంక్ నిర్మించాలన్న ప్రతిపాదనలకు ప్రభుత్వం ఆమోదించింది. ఇందుకు రూ.1.20 కోట్ల నిధులు విడుదల చేసింది.

బాలికలకు తీరిన వసతిసమస్య...



బాలికల మూడో వసతిగృహం

దివంగత ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖరరెడ్డి హయాంలో మంజూరైన జేఎన్‌టీయూకు అప్పట్లో నిర్మించిన వసతి గృహాలే ఇప్పటికీ దిక్కు అవుతున్నాయి. గత 12 ఏళ్లలో విస్తరణపై గత ప్రభుత్వాలు దృష్టి పెట్టలేదు. దీంతో బాలికలకు కేవలం రెండు వసతి గృహాలే ఉన్నాయి. దీంతో మరో వసతి గృహం నిర్మాణానికి ఏపీఐసీటీ అనుమతి ఇచ్చింది. రూ.3.25 కోట్ల నిధులను మంజూరు చేసింది. దీంతో దాదాపు వంద మందికి నివాస సామర్థ్యంతో మూడంతస్తుల భవనాన్ని నిర్మించారు.

విద్యపై ఖర్చు భవితకు పెట్టుబడి...

ప్రభుత్వం విద్యారంగంపై ఖర్చుపెట్టే ప్రతీ పైసా భవిష్యత్ తరానికి పెట్టుబడిగా భావిస్తోంది. రాష్ట్ర చరిత్రలో గతమెన్నడూ లేనివిధంగా ఈ నాలుగున్నరేళ్లలో రికార్డు స్థాయిలో సుమారు రూ.73వేల కోట్లను ఖర్చు చేసింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యకు ఎంత ప్రాధాన్యం ఇస్తున్నారో దీన్ని బట్టి అర్థమవుతోంది. ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియం ప్రవేశపెట్టడం, ట్యాబ్‌ల పంపిణీ, సీబీఎస్‌సీ సిలబస్, ఐబీఎంతో ఒప్పందం అందులో భాగమే. ఉన్నత విద్య కోసం విదేశాలకు వెళ్లాల్సిన అవసరం లేదు. ఆన్‌లైన్ విధానంలో అందుబాటులోకి రానున్నాయి. జేఎన్‌టీయూ–గురజాడ విజయనగరం విశ్వవిద్యాలయాన్ని ప్రపంచస్థాయి యూనివర్సిటీగా తీర్చిదిద్దడానికి అవసరమైన అన్ని వసతులను కల్పిస్తాం.

– బొత్స సత్యనారాయణ, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి

ఎన్నికలకు ముందస్తు పోలీస్ చర్యలు: డీఐజీ



పార్వతీపురం మన్యం, ఏఎస్‌ఆర్, అనకాపల్లి జిల్లాల అదనపు ఎస్పీలు, ఏఎస్పీలతో మాట్లాడుతున్న రేంజ్ డీఐజీ విశాల్ గున్నీ

ఆరిలోవ (విశాఖపట్నం): సాధారణ ఎన్నికలు జరగనున్న సందర్భంగా విశాఖ రేంజ్‌లో ముందస్తు పోలీస్ చర్యలు చేపట్టాలని విశాఖ రేంజ్ డీఐజీ విశాల్ గున్నీ పోలీస్ అధికారులకు సూచించారు. పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు జిల్లాల అదనపు ఎస్పీలు, ఏఎస్పీలు మంగళవారం నగరంలో విశాలాక్షినగర్ కైలాసగిరి ఏఆర్ కార్యాలయంలో డీఐజీని మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ఆయనతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా విశాల్ గున్నీ అధికారులతో మాట్లాడుతూ శాంతి భద్రతలు, కమ్యూనిటీ పోలీసింగ్‌పై చర్చించారు. రానున్న సార్వత్రిక ఎన్నికలకు ముందస్తు చర్యల్లో భాగంగా చెక్‌పోస్టుల వద్ద విస్తృత తనిఖీలు చేయాలని ఆయన అదనపు ఎస్పీలను ఆదేశించారు. సమస్యాత్మకమైన ప్రాంతాలను గుర్తించి వాటిలో ముందస్తు భద్రతా చర్యలు చేపట్టాలన్నారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. డీఐజీని కలసిన వారిలో చింతూరు సబ్ డివిజన్ అదనపు ఎస్పీ రాహుల్ మీనా, అనకాపల్లి అదనపు ఎస్పీ పి.సత్యనారాయణ, శ్రీకాకుళం అదనపు ఎస్పీ ప్రేమ్‌కాజల్, రంపచోడవరం, పాడేరు, పార్వతీపురం మన్యం జిల్లాల ఏఎస్పీలు కె.ధీరజ్, జగదీష్ ఆడహల్లి, సునీల్ షరోన్ పాల్గొన్నారు.

వెనుకబడిన విద్యార్థులకు ఉచిత విద్య

పార్వతీపురం: ప్రైవేటు పాఠశాలల్లో ఒకటో తరగతిలో ప్రవేశానికి వెనుకబడిన విద్యార్థులకు 25 శాతం ఉచిత సీట్లు కల్పిస్తున్నట్టు కమిషనర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ ఉత్తర్వులు జారీచేసిందని ఇన్‌చార్జి డీఈఓ ఎం.ఇ.రమాజ్యోతి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల విద్యార్థులు ఈ నెల 23 నుంచి మార్చి 14వ తేదీ వరకు పోర్టల్‌లో నమోదు చేసుకోవాలని తెలిపారు. 1వ రౌండ్ ఫలితాలను ఏప్రిల్1న, 2వ రౌండ్ ఫలితాలు ఏప్రిల్ 15న ప్రకటిస్తామన్నారు.

అడ్డాపుశిల వద్ద కొత్త కలెక్టరేట్



పార్వతీపురం కలెక్టర్ కార్యాలయ సముదాయం ఏర్పాటులో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, అధికారులు (ఫైల్)

- కలెక్టర్ కార్యాలయ సముదాయం నిర్మాణానికి ఉత్తర్వులు జారీ
- రూ.99.90 కోట్లు కేటాయించిన ప్రభుత్వం

పార్వతీపురం: పార్వతీపురం మన్యం జిల్లాలో కొత్తగా కలెక్టర్ కార్యాలయ నిర్మాణం కోసం రూ.99.90 కోట్లను మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సమీకృత జిల్లా కలెక్టర్ కార్యాలయ సముదాయం (ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్ కాంప్లెక్స్) పార్వతీపురం మండల పరిధిలోని అడ్డాపుశిల రెవెన్యూ పరిధిలో నిర్మితంకానుంది. రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన 13 జిల్లాల్లో సమీకృత జిల్లా కలెక్టర్ కార్యాలయ సముదాయాలు నిర్మించాలని ప్రభుత్వ నిర్ణయించింది. అందులో భాగంగా రహదారులు, భవనాలు శాఖ ఇంజినీర్ ఇన్ చీఫ్ సమర్పించిన సవివరమైన నివేదిక మేరకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. జిల్లాలో మొదటి విడతలో నిర్మాణానికి నిధులు మంజూరు కావడం హర్షించదగ్గ పరిణామం. పార్వతీపురం మన్యం జిల్లా ఏప్రిల్ 4, 2022న ఏర్పాటైంది. ఐటీడీఏ కార్యాలయం కోసం నిర్మించిన నూతన భవనాన్ని కలెక్టర్ కార్యాలయానికి, సెయింట్ జోషఫ్ పాఠశాలలో ఇతర శాఖలను అప్పటి గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పాముల పుష్పశ్రీవాణి ప్రారంభించారు. ప్రభుత్వం కొత్తగా కలెక్టర్ కార్యాలయ భవనానికి నిధులు కేటాయించడంపై జిల్లాప్రజలు, ప్రజాప్రతినిధులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సంతోషంగా ఉంది

సమీకృత జిల్లా కలెక్టర్ కార్యాలయ సముదాయం నిర్మాణానికి నిధులు మంజూరుచేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడం సంతోషంగా ఉందని కలెక్టర్ నిషాంత్‌కుమార్ అన్నారు. కలెక్టర్ కార్యాలయ భవన నిర్మాణానికి అడ్డాపుశీల వద్ద భూమిని ఎంపిక చేశామని, 59.80 ఎకరాల భూమిని కేటాయించామని చెప్పారు. భవన నిర్మాణ పనులు త్వరగా ప్రారంభమై, వేగవంతంగా పూర్తి కావాలని ఆకాంక్షిస్తున్నామన్నారు.

గిరిజన హక్కులకు భంగం కలిగించొద్దు

- డిప్యూటీ సీఎం, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పీడిక రాజన్నదొర

మక్కువ: గిరిజనుల హక్కులుకు భంగం కలిగిస్తే ఊపేక్షించేది లేదని అటవీశాఖ అధికారులను డిప్యూటీ సీఎం, గిరిజనసంక్షేమ శాఖ మంత్రి పీడిక రాజన్నదొర హెచ్చరించారు. మండలంలోని గుంటభద్ర గ్రామానికి చెందిన గిరిజనులు సాగుచేస్తున్న భూములుకు ప్రభుత్వం ఆర్‌ఓఎఫ్‌ఆర్ పట్టాలు అందించింది. ఆ భూములను గిరిజనులు జీడిపంట సాగుచేస్తున్నారు. ఇటీవల కొన్నిరోజులుగా రిజర్వ్‌ఫారెస్ట్‌కు సమీపంలోని భూములు సాగుచేయవద్దని అటవీశాఖ అధికారులు హెచ్చరిస్తున్నారన్నారు. విషయాన్ని మంత్రి దృష్టికి గిరిజనులు తీసుకెళ్లడంతో ఆయన స్పందించారు. ఎన్నో ఏళ్ల నుంచి సాగుచేస్తున్న కొండపోడు భూములుకు ప్రభుత్వం పట్టాలిచ్చిందని, ఆ భూముల్లో గిరిజనులు అటవీఉత్పత్తులు సాగుచేస్తున్నారని, గిరిజన రైతుల పంటల సాగుకు అభ్యంతరం చెప్పొద్దన్నారు. అటవీశాఖ అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇవ్వాలని కలెక్టర్, ఐటీడీఏ పీఓ, డీఎఫ్‌ఓలకు సూచించారు.

అనుమతులు లేకుండా

ఇసుక తరలిస్తే చర్యలు



సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ నిషాంత్‌కుమార్

పార్వతీపురం: అనుమతులు లేకుండా ఇసుకు తరలిస్తే చర్యలు తప్పవని కలెక్టర్ నిషాంత్‌కుమార్ హెచ్చరించారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సుప్రీంకోర్టు గ్రీన్ ట్రిబునల్ ఆదేశాల మేరకు పర్యావరణ అనుమతులు లేకుండా ఇసుక తవ్వకాలు జరపకూడదన్నారు. అనుమతులు పొందిన రీచ్‌లలో కూడా పర్యావరణానికి సంబంధించిన అన్ని అనుమతులు పొందిన తరువాత మాత్రమే ఇసుక తవ్వకాలు జరపాలన్నారు. జనవరి 4న జిల్లాలో నాలుగు రీచ్‌లకు అనుమతులు ఇచ్చామన్నారు. జిల్లాలో నదీ పరివాహక ప్రాంతాలు ఎక్కువగా ఉన్నాయని, వాటిని నిరంతరం పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. ఇసుక అక్రమ రవాణాకు సంబంధించి 2023లో 50 కేసులు, ఈ ఏడాది ఇంతవరకు రెండు కేసులు నమోదు చేసినట్టు వెల్లడించారు. సమావేశంలో జేసీ ఆర్.గోవిందరావు, ఇన్‌చార్జి డీఆర్వో జి.కేశవనాయుడు, ఆర్డీఓ సి.మల్లికార్జునరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

తనిఖీలు పెంచాలి

సాధారణ ఎన్నికల నేపథ్యంలో గంజాయి, మద్యం, డ్రగ్స్, నగదు రవాణాను నిరోధించేందుకు తనిఖీలు పెంచాలని కలెక్టర్ నిషాంత్ కుమార్ ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం జరిగిన నార్కో కోఆర్డినేషన్ సెంటర్ జిల్లా స్థాయి కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. మాదకద్రవ్యాల నిరోధంపై పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఎస్పీ విక్రాంత్ పాటిల్ మాట్లాడుతూ జిల్లాలో మూడు చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి నిరంతరం తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. సమావేశంలో జేసీ ఆర్.గోవిందరావు, డీఎఫ్‌ఓ జి.ప్రసూన, డీఎంహెచ్‌ఓ బి.జగన్నాథం పాల్గొన్నారు.

ఏ ముఖం పెట్టుకుని వస్తారు?

- టీడీపీ నాయకుల పర్యటనపై మండిపడుతున్న ప్రజానీకం



పార్వతీపురంటౌన్: గతంలో 14ఏళ్ల ముఖ్యమంత్రిగా ఉన్న నారా చంద్రబాబునాయుడు పార్వతీపురం ప్రాంతాన్ని ఏనాడైనా పట్టించుకున్నారా? ఏమైనా అభివృద్ధి చేశారా? ప్రజలకు ఏమైనా సంక్షేమ పథకాలు అందించారా?

ఏ ముఖం పెట్టుకుని పార్వతీపురం పర్యటనకు ఆయన కుమారుడు లోకేశ్‌ను పంపిస్తున్నారంటూ పార్వతీపురం మన్యం జిల్లా ప్రజానీకం మండిపడుతున్నారు. గతంలో వృద్ధాప్య పింఛన్, ఇళ్లు, ఫీజు రీయింబర్స్‌మెంట్, ఏ చిన్న ప్రభుత్వ సంక్షేమ పథకం కావాలన్నా పేదవారి సొమ్మును రాబందుల్లా జన్మభూమి కమిటీలు పీడించుకుతిన్న సంఘటనలు కోకొల్లలు. ఆరోగ్యానికి సంబంధించిన 108 అంబులెన్స్‌లను కూడా ప్రజలకు దూరం చేసిన ఘనత అప్పటి టీడీపీ నాయకులదే. అధికారంలో ఉన్న కాలంలో ప్రజల సంక్షేమాన్ని, అభివృద్ధిని పట్టించుకోండా తన కుమారుడు అభివృద్ధే ధ్యేయంగా రాష్ట్రాన్ని చంద్రబాబు ప్రభుత్వం అప్పుల పాలు చేసింది. 2014 ఎన్నికల ముందు 614 బూటకపు హామీలిచ్చి, ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చిన తరువాత హామీలను గాలికొదిలేసి ప్రజలను అడుగడుగునా మోసం చేసింది. రైతులకు రూ.87వేల కోట్లు రుణమాఫీ చేస్తానని చెప్పి చేసిన దాఖలాలు లేవు. డ్వాక్రా మహిళలకు రూ. 14వేల కోట్లు రుణమాఫీ చేయకుండా మహిళలను సైతం మోసం చేసిన ఘనత చంద్రబాబుకే దక్కుతుంది. నిరుద్యోగ యువతకు ఉద్యోగం కల్పిస్తామని చెప్పి ఉద్యోగాలు ఇవ్వకుండా కేవలం 2019 ఎన్నికల ముందు యువతకు రూ. 1000లు నిరుద్యోగ భృతిని జన్మభూమి కమిటీ సిఫార్సుల మేరకు మాత్రమే అందజేశారు.

చంద్రబాబు పథకం ఒక్కటైనా ఉందా?

14ఏళ్ల ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబుపేరు చెబితే ఒక్క సంక్షేమ పథకమైన గుర్తు వస్తుందా? అంటూ ప్రజలు చర్చించుకుంటున్నారు. మళ్లీ అధికారం చేపట్టేందుకు చంద్రబాబు, ఆయన తనయుడు లోకేష్ ప్రజలను బురిడీ కొట్టించేందుకు ఆరుహామీల పేరిట మళ్లీ మోసం చేసేందుకు తిరుగుతున్నారని ఎద్దేవా చేస్తున్నారు.

శబ్దంలేని లోకేశ శంఖం

- వసలేని ప్రసంగంతో నిరుత్సాహంలో పార్టీ కేడర్
- వేదికపై సీనియర్లకు దక్కని చోటు
- బయట పడిన టీడీపీ వర్గవిభేదాలు
- పాలకొండ సీటు జనసేనకే అంటూ నినాదాలు



గరుగుబిల్లి మండలం ఎర్రన్నగుడి వద్ద సభలో జనంలేక ఖాళీగా దర్శనమిస్తున్న కుర్చీలు

గరుగుబిల్లి/ కురుపాం/పాలకొండ/పాలకొండ రూరల్: యువగళం పేరుతో పార్వతీపురం మన్యం జిల్లా పాలకొండ, కురుపాం నియోజకవర్గాల్లో టీడీపీ నేత నారాలోకేశ్ పూరించిన శంఖారావం సభకు జనస్పందన కరువైంది. శబ్దంలేని శంఖంలా మారింది. వసలేని ప్రసంగంతో క్యాడర్ నైరాశ్యంలోకి వెళ్లిపోయింది. ఇలాంటి నాయకుడితో ఎన్నికల బరిలోకి వెళ్తే ఓటమి ఖాయమంటూ కొందరు పార్టీశ్రేణులు బహిరంగంగానే విమర్శించారు. సభలో ప్రభుత్వం, స్థానిక నాయకులపై ఆరోపణలు, విమర్శలకే పరిమితమయ్యారు. ప్రజలకు ఏమి చేస్తామో ఒక్కమాట కూడా చెప్పకపోవడంతో విసిగిపోయారు. కురుపాంలో నియోజకవర్గ టీడీపీ అభ్యర్థిని ప్రకటిస్తారని పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి తోయక జగదీశ్వరి, వీరేష్ చంద్రదేవ్ అనుచరులు ఎవరికివారే ఆశించారు. అలాంటి ప్రస్తావన చేయకపోవడంతో ఇరువర్గాలు నిరాశకు గురయ్యాయి. అధిక కేసులు ఉన్న పార్టీ కార్యకర్తలకు నామినేటెడ్ పదవి ఇస్తానంటూ లోకేశ్ రెచ్చగొట్టే వ్యాఖ్యలపై మేధావి వర్గం మండిపడింది. అధికారులపై చర్యలు తప్పవంటూ హెచ్చరికలు జారీచేయడాన్ని తప్పుబట్టారు. కనీస పరిజ్ఞానం లేకుండా లోకేశ్ మాట్లాడుతున్నారంటూ విమర్శించారు. అధికారంలో ఉన్న సమయంలో పూర్ణపాడు–లాబేసు వంతెనను పట్టించుకోని టీడీపీ నాయకులు, అధికారంలోకి వస్తే వంతెన నిర్మాణాన్ని పూర్తి చేస్తామని ప్రకటించడంపై ఆశ్చర్యం వ్యక్తంచేశారు. అధికారంలో ఉన్నన్నాళ్లు నిరుద్యోగులకు ఉద్యోగం కల్పించకుండా.. అధికారంలోకి వస్తే 20లక్షలు ఉద్యోగాలు కల్పిస్తామని ప్రకటించడంపై ముక్కున వేలేసుకున్నారు. సూపర్ సిక్స్ హామీలపై ప్రతిజ్ఞ చేస్తుండగానే ప్రజలు సమావేశం నుంచి వెనుదిరిగారు. సమావేశంలో మాజీ మంత్రి శత్రుచర్ల విజయరామరాజు, అరకు పార్లమెంట్ అధ్యక్షుడు కె. శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

తీరని అవమానం

పాలకొండ–వీరఘట్టం రహదారిలో గజాలాఖానా సమీపంలో ఏర్పాటు చేసిన లోకేశ్ సభకు పాలకొండ నియోజకవర్గ ఇన్‌చార్జి నిమ్మక జయకృష్ణ, వ్యతిరేక వర్గం వేర్వేరుగా బయలు దేరారు. సభా వేదిక పైకి జయకృష్ణ వ్యతిరేక వర్గాన్ని అడ్డుకోవడంతో వాగ్వాదానికి దిగారు. ఇదికాస్త బాహాబాహీకి దారితీసింది. కాసేపు గలాటా నెలకొనడంతో సీనియర్ నాయకులు వచ్చి పార్టీ కార్యకర్తలను శాంతింపజేశారు. సభకు ఆహ్వానించి అవమానించడంపై కొందరు నాయకులు మండిపడ్డారు. పార్టీ అభ్యర్థికి డిపాజిట్లుకూడా రాకుండా చేస్తామంటూ హెచ్చరించారు.



లోకేశ్ సభలో బాహాబాహీకి దిగిన తెలుగు తమ్ముళ్లు

క్లుప్తంగా

బీఎస్ఎన్ఎల్ ఉద్యోగుల నిరసన



బీఎస్ఎన్ఎల్ కార్యాలయం ఆవరణలో నిరసన వ్యక్తం చేస్తున్న ఎన్ఎఫ్టీఈ యూనియన్ నాయకులు

విజయనగరం టౌన్: స్థానిక బీఎస్ఎన్ఎల్ కార్యాలయం ఆవరణలో నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ టెలికమ్ ఎంప్లాయీస్ ఆధ్వర్యంలో భోజన విరామ సమయంలో ఉద్యోగులు మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జి.భాస్కరరావు, జి. అప్పారావులు మాట్లాడుతూ అఫోర్డబిలిటి క్లాజ్ నుంచి బీఎస్ఎన్ఎల్‌కు మినహాయింపు ఇవ్వాలని కోరారు. అదేవిధంగా 2017 జనవరి ఒకటో తేదీ నుంచి మూడో వేతన సవరణ అమలుచేయాలని, పెన్షన్ రివిజన్ చేయాలని, అన్ని కేడర్స్ శాంక్షన్ స్ట్రెంత్‌ను సవరించాలని డిమాండ్ చేశారు. నూతన ప్రమోషన్ పాలసీని ఏర్పాటుచేయాలని కోరారు. కార్యక్రమంలో ఎన్ఎఫ్టీఈ నాయకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

పాత దుగ్గిలో ఏనుగుల గుంపు



పాత దుగ్గిలో సంచరిస్తున్న ఏనుగులు

కొమరాడ: మండలంలోని పాత దుగ్గి గ్రామానికి ఏనుగుల గుంపు మంగళవారం చేరుకుంది. ఇటీవల జియ్యమ్మవలస మండలంలోని బాసింగి, నిమ్మలపాడు, వెంకటరాజుపురం గ్రామ పరిసరాల్లో సంచరించిన ఏనుగుల గుంపు నాగావళి ఇవతలి వైపు చేరుకుంది. దీంతో ఈ ప్రాంత రైతులు ఆందోళన చెందుతున్నారు. రాత్రివేళ పొలాలకు రైతులు వెళ్లవద్దని అటవీశాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు.

టిఫిన్ షాపు దగ్ధం



అగ్నికి ఆహుతవుతున్న షాపు

శృంగవరపుకోట: మండలంలోని తిమిడి గ్రామంలో మంగళవారం సాయంత్రం జరిగిన అగ్ని ప్రమాదంలో గ్రామానికి చెందిన ఆకుల సంతోష్ టిఫిన్ షాపు దగ్ధమైంది. సాయంత్రం ఆ షాపు సమీపంలో గ్రామస్తులంతా ఉండడంతో వెంటనే మంటలను అదుపు చేశారు. దీంతో పెద్ద ప్రమాదం తప్పిందని గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఆరుగురికి గాయాలు



గాయపడిన ఏసురత్నం



గాయపడిన బాలరాజు

వీరఘట్టం: మండలంలోని రేగులపాడు జంక్షన్ వద్ద మంగళవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆరుగురికి గాయాలయ్యాయి. ఈ మేరకు పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పాలకొండలో జరిగిన టీడీపీ శంఖారావం సభకు వెళ్లిన వీరఘట్టం మండలంలోని గడగమ్మకు చెందిన ఏసురత్నం, బాలరాజుతో పాటు మరో వ్యక్తి ఆటోలో వస్తున్నారు. అదే సమయంలో తెట్టంగి గ్రామానికి చెందిన జయరాజ్‌తో పాటు మరో ఇద్దరు బైక్‌పై వస్తుండగా ఆటో–బైక్ ఢీకొనడంతో ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ఏసురత్నం కుడిభుజం, బాలరాజు తలకు తీవ్ర గాయాలవ్వడంతో వారిద్దరిని శ్రీకాకుళంలోని రిమ్స్‌కు తరలించారు. మిగిలిన వారికి పాలకొండలో ఏరియా ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు. ఈ ప్రమాదంపై ఎస్సై గోవింద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పంటరుణ పరిమితి పెంపు

- వరి, చెరకు, అరటి, పత్తి పంటలకు వర్తింపు
- మన్యం జిల్లాలో 76వేల మంది రైతులకు లబ్ధి

పార్వతీపురం:

సాగు ఖర్చులకు అనుగుణంగా రైతులకు పంటరుణాలు మంజూరు చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. వ్యవసాయ పెట్టుబడుల కోసం ప్రైవేట్ వ్యాపారులవద్ద రైతులు అధిక వడ్డీకి నగదు తెచ్చి నష్టపోకుండా ఉండేందుకు వీలుగా పంట రుణాల పరిమితిని పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు వ్యవసాయం, వ్యవసాయ అనుబంధ రంగాల అధికారులు, బ్యాంకర్లతో కలెక్టర్ నిషాంత్ కుమార్ ఇటీవల సమావేశం నిర్వహించారు. 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి వివిధ పంటలకు ఎకరా విస్తీర్ణానికి రుణ పరిమితి (స్కేల్ ఆఫ్ ఫైనాన్స్)పై మార్గదర్శకాలను రూపొందించారు. అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకుని సాంకేతిక కమిటీ ద్వారా రుణపరిమితిని పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు. నూతన ప్రతిపాదనల ప్రకారం స్కేల్ ఆఫ్ ఫైనాన్స్‌కు అదనంగా 30 శాతం వరకు పెంచుతూ రుణాలు మంజూరు చేసేలా బ్యాంకర్లు నిర్ణయం తీసుకున్నారు. రుణ పరిమితి పెంపు రానున్న ఖరీఫ్‌నుంచి అమలులోకి రానుంది. అనుబంధ రంగాల రైతుల సంక్షేమానికి ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పథకాలు, కార్యక్రమాలను సద్వినియోగం చేసుకుని ఉన్నతంగా ఎదగాలని కలెక్టర్ నిషాంత్‌కుమార్ పిలుపునిచ్చారు.

జిల్లాలో సాగు వివరాలిలా..

పార్వతీపురం మన్యం జిల్లాలోని 15 మండలాలలో ప్రధానమైన వరి పంటను 1.77 వేల ఎకరాల్లో దాదాపు 86 వేల మంది రైతులు సాగుచేస్తున్నారు. అలాగే అరటి పంటను 26వేల ఎకరాలలో, పత్తి పంటను 9వేల ఎకరాలలో, చెరకు పంటను 10 వేల ఎకరాలలో సాగుచేస్తున్నారు. రుణ పరిమితి పెంపు కారణంగా రైతులు ఎవరివద్ద పెట్టుబడులకోసం చేయి చాచకుండా బ్యాంకులనుంచి రుణం పొందేందుకు అవకాశం ఉంది. రుణపరిమితి పెంచుతూ బ్యాంకులు నిర్ణయం తీసుకోవడంవల్ల రైతులకు ఎంతో లాభం చేకూరుతుంది.



బ్యాంకర్లతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నిషాంత్‌కుమార్ (ఫైల్)

వివిధ పంటల రుణపరిమితి పెంపు ఇలా..

పంట రకం	గత ఏడాది రుణ సదుపాయం	పెంపు ఇలా..
వరి	రూ. 38వేలు-రూ.42 వేలు	రూ.42వేలు-రూ.45 వేలు
చెరకు(ప్లాంటేషన్)	రూ.77వేలు-రూ.80వేలు	రూ.82వేలు-రూ.85 వేలు
చెరకు(కాంటూన్)	రూ.66వేలు-రూ.70వేలు	రూ.70వేలు-రూ.75వేలు
అరటి(ప్లాంటేషన్)	రూ.65వేలు-రూ.80వేలు	రూ.85వేలు-రూ.95వేలు
అరటి (కాంటూన్)	రూ.45వేలు-రూ.60వేలు	రూ.60వేలు-రూ.75వేలు
జొన్న(సాగునీరున్న ప్రాంతంలో)	రూ.38వేలు-రూ.42వేలు	రూ.45వేలు-రూ.49వేలు
జొన్న(సాగునీరులేని ప్రాంతంలో)	రూ.24వేలు-రూ.26వేలు	రూ.26వేలు-రూ.30వేలు
పత్తి(సాగునీరున్న ప్రాంతంలో)	రూ.40వేలు-రూ.45వేలు	రూ.48వేలు-రూ.52వేలు
పత్తి(సాగునీరు లేని ప్రాంతంలో)	రూ.38వేలు-రూ.42వేలు	రూ.45వేలు-రూ.48వేలు
చోడి(సాగునీరున్న ప్రాంతంలో)	రూ.16వేలు-రూ.20వేలు	రూ.20వేలు-రూ.22వేలు
చోడి(సాగునీరు లేని ప్రాంతంలో)	రూ.16వేలు-18వేలు	రూ.18వేలు-20వేలు

రైతులకు ఉపయోగం



వివిధ రకాల పంటలను సాగుచేసే రైతులకు బ్యాంకులిచ్చే రుణాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయి. వ్యవసాయ పెట్టుబడులకు అటు ప్రభుత్వం రైతు భరోసాను ఇవ్వగా, బ్యాంకులు పంట రుణాలు ఇవ్వడంతో ఎలాంటి ఆందోళన చెందకుండా వ్యవసాయం చేసుకునేందుకు ఉపయోగపడుతుంది. ప్రభుత్వం, బ్యాంకర్లు కలిసి రైతులను ఆదుకునేందుకు ముందుకు రావడం సంతోషంగా ఉంది.

– బొత్స తాతబాబు, రైతు, నాగూరు

రైతుకు ఆర్థిక భరోసా కల్పించేందుకే..



వ్యవసాయ పెట్టుబడుల కోసం రైతులు ఇతరులపై ఆధారపడకుండా ఉండేలా ఆర్థిక భరోసా కల్పించేందుకు రుణపరిమితిని పెంచుతూ బ్యాంకర్లు ప్రతిపాదనలు చేశారు. రుణపరిమితి పెంపు రానున్న ఖరీఫ్‌నుంచి అమలులోకి వస్తుంది. వ్యవసాయం ఇతర అంశాలను ప్రాతిపదికగా చేసుకుని రుణపరిమితి పెంపు నిర్ణయం తీసుకున్నారు. వ్యవసాయం చేసే రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది.

– నిషాంత్‌కుమార్, కలెక్టర్, పార్వతీపురం మన్యం జిల్లా

బీసీ స్టేటస్ సాధనే ధ్యేయం

- విజయనగరం జిల్లాకు చేరుకున్న పీవీఆర్ పాదయాత్ర



కోట జంక్షన్ వద్ద మాట్లాడుతున్న తెలగ సంఘం నాయకుడు పీవీఆర్

విజయనగరం టౌన్: బీసీ స్టేటస్ సాధించేవరకూ పోరాటం ఆగదని తెలగ సంఘం ఉత్తరాంధ్రా నాయకుడు పల్లంట్ల వెంకటరామారావు (పీవీఆర్) పేర్కొన్నారు. ఇచ్ఛాపురం నుంచి పాయకరావుపేట వరకూ నిర్వహించ తలపెట్టిన పాదయాత్ర మంగళవారం విజయనగరం చేరుకుంది. ఈ సందర్భంగా స్థానిక కోట జంక్షన్‌కు వందల సంఖ్యలో అభిమానులు, సంఘం నాయకులు వచ్చి ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. క్రేన్‌తో గజమాలను వేసి, అభిమానం చాటుకున్నారు. మహిళలు హారతి పట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజకీయపార్టీలకతీతంగా కులస్తులందరూ ఏకతాటిపై నిలబడాల్సిన సమయం ఆసన్నమైందని పిలుపునిచ్చారు. ఏ పార్టీ అయితే తెలగ కులస్తులకు బీసీ స్టేటస్ ఇస్తామని మేనిఫెస్టోలో ప్రకటిస్తుందో ఆ పార్టీకి తమ సహకారమందిస్తామన్నారు. ఎందరో తెలగ కులంలో పుట్టిన బిడ్డలు రిజర్వేషన్లు లేకపోవడంతో చివరి నిమిషం వరకూ పోరాటం చేసి, ఉద్యోగాల్లేక చివరకు ఆత్మహత్యలకు పాల్పడుతున్న సంఘటనలు చూసి, తన మనసు కలిచివేసిందన్నారు. రాజకీయనాయకులు ఇప్పటికైనా తమకు భరోసానివ్వాలని కోరారు. అనంతరం శ్రీపైడితల్లి అమ్మవారిని దర్శించుకుని, ర్యాలీని గంటస్తంభం, వెంకటలక్ష్మి థియేటర్, రైల్వే స్టేషన్ రోడ్డు, మీదుగా నిర్వహించి వై జంక్షన్‌కు చేరుకున్నారు. కార్యక్రమంలో సంఘం నాయకుడు పెద్ది లక్ష్మీనారాయణ, అధిక సంఖ్యలో అభిమానులు, ప్రతినిధులు పాల్గొన్నారు.

17న పోలిపల్లి పైడితల్లి జాతరకు ముహూర్తపు రాట



పోలిపల్లి పైడితల్లి అమ్మవారు

రాజాం సిటీ: స్థానిక బొబ్బిలి రోడ్డులో వెలసిన పోలిపల్లి పైడితల్లి అమ్మవారి జాతరకు సంబంధించి ముహూర్తపు రాట ఈ నెల 17న ఉదయం 9.45 గంటలకు వేయనున్నామని ఈఓ బీవీ మాధవరావు మంగళవారం తెలిపారు. ఈ కార్యక్రమంలో అనువంశిక ధర్మకర్త వాకచర్ల దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో తొలుత ప్రత్యేక పూజలు జరపనున్నామని పేర్కొన్నారు. మార్చి 17, 18, 19 తేదీల్లో జరగనున్న జాతరకు నెల రోజుల ముందుగా ముహూర్తపు రాట వేసిన అనంతరం జాతర పనులు చేపట్టనున్నామన్నారు. జాతరకు అధిక సంఖ్యలో భక్తులు హాజరుకావాలని ఆయన కోరారు.

శంబరలో బారులు తీరిన భక్తులు



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు



పోలమాంబ అమ్మవారు

మక్కువ: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు శంబర పోలమాంబ అమ్మవారి నాల్గవ జాతరకు భక్తులు బారులు తీరారు. అధికారుల అంచనాకు మించి భక్తులు తరలివచ్చారు. దీంతో చదురుగుడి, వనంగుడి క్యూలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. మంగళవారం తెల్లవారు జామునుంచి వేలాదిమంది భక్తులు ప్రైవేట్ వాహనాలు, ఆర్టీసీబస్సులు, ట్రాక్టర్లతో శంబర చేరుకున్నారు. తొలుత చదురుగుడిలో కొలువైన పోలమాంబ అమ్మవారిని, అనంతరం వనంగుడిలో ఉన్న పెదపోలమాంబ అమ్మవారిని దర్శించారు. ఆలయం వెనుకన ఉన్న పురాతన వేపచెట్టుకు పూజలు చేశారు. అమ్మవారికి కోళ్లు, మేకలు, చీరలు మొక్కుబడులు చెల్లించి చెట్లకింద వండుకుని కుటుంబసమేతంగా భోజనాలు చేశారు. భక్తులు ఇబ్బందులు పడకుండా ఎస్సై నరసింహమూర్తి, ఈవో వీవీ సూర్యనారాయణ, సిబ్బంది మురళి, కృష్ణ చర్యలు చేపట్టారు.

బిందు సేద్యంతో లాభాలు

రాజాం: బిందు, తుంపర సేద్యం పద్ధతులు పాటిస్తే రైతులకు ఎన్నో లాభాలు, ప్రయోజనాలు ఉన్నాయని జిల్లా మైనర్ ఇరిగేషన్ పీడీ పీఎస్‌వీ లక్ష్మీనారాయణ అన్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన రాజాం మండలంలోని రామానుజులపేట గ్రామంలో రాయితీపై అందించిన పైపులను పరిశీలించడంతో పాటు రైతులు వినియోగించే తీరుపై ఆరాతీశారు. ఆయా గ్రామాల్లోని రైతులకు పైపుల వినియోగం, ప్రభుత్వం అందిస్తున్న రాయితీ గురించి వివరించారు. 5 ఎకరాల్లోపు పంటపొలాలు ఉన్న చిన్న, సన్నకారు రైతులకు 90 శాతం రాయితీపై, 5 ఎకరాలు దాటిన రైతులకు 50 శాతం రాయితీపై వాటిని అందిస్తున్నామని, ప్రస్తుతం ఈ పథకం ద్వారా లబ్ధిపొందాలనుకునే రైతులు రైతు భరోసా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. రాజాం మండలంలో 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి డ్రిప్ ఇరిగేషన్ నిమిత్తం 22 మంది రైతులు దరఖాస్తు చేసుగా, 16.5 హెక్టార్లలో సాగునీటిని అందించేందుకు వారికి రూ.15.23 లక్షల రాయితీతో పైపులు అందజేశామని తెలిపారు. బిందు సేద్యం నిమిత్తం 9 మంది రైతులు దరఖాస్తు చేసుకోగా, వారికి 6.98 హెక్టార్లలో సాగునీటిని అందించేందుకు రూ.1.25 లక్షల రాయితీతో పైపులు అందించినట్లు వివరించారు. రాజాం మండలంలో 40 హెక్టార్లు లక్ష్యంగా చేసుకున్నామని, రైతులు వినియోగించుకోవాలని కోరారు. మామిడి, సపోటా వంటి పండ్ల తోటలతో పాటు పామాయిల్, కూరగాయల సాగుకు వాటిని వినియోగించవచ్చని చెప్పారు. తక్కువ నీటితో ఎక్కువ పంటలు పండించే అవకాశం ఉందన్నారు.

పైడితల్లికి పుష్పాలంకరణ



ప్రత్యేక పుష్పాలంకరణలో పైడితల్లి అమ్మవారు



దర్శించుకుంటున్న భక్తులు

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్యదైవం, కోరిన కోర్కెలు తీర్చే కలవల్లి శ్రీ పైడితల్లి అమ్మవారు మంగళవారం పుష్పాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఏడిద రమణ ఆధ్వర్యంలో అమ్మవారికి పంచామృతాలతో అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. అనంతరం ఆలయ సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు, తాళ్లపూడి ధనుంజయ్, మూలా పాపారావులు శాస్త్రోక్తంగా నిత్య పూజాదికాలు చేశారు. మహిళలు అమ్మవారిని దర్శించి, పసుపు, కుంకుమలను సమర్పించి మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆలయ కార్యనిర్వహణాధికారిణి కేఎల్.సుధారాణి కార్యక్రమాలను పర్యవేక్షించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించి, తరించారు.

జేఈఈ మెయిన్స్‌లో సత్తా



శశాంక్



మాధవరావు



ధనుకొండ శ్రీనిధి



జంకాల చైతన్య



రొంగలి లీలా పవన్



కె.ఉపేంద్ర



గేదెల చైతన్య



ఆరిక ప్రశాంత్



షణ్ముఖ సాయినాథ్



సవర స్రవంతి



బి. ఫ్రాన్సిస్



ఎస్.అభి

రామభద్రపురం: జేఈఈ మెయిన్స్ సెషన్–1 ఫలితాల్లో ఉమ్మడి విజయనగరం జిల్లా విద్యార్థులు పలువురు సత్తా చాటారు. వివరాలిలా ఉన్నాయి. రామభద్రపురం మండలకేంద్రానికి చెందిన తెర్లి శశాంక్ సత్తా చాటాడు. మంగళవారం విడుదలైన ఫలితాల్లో 300 మార్కులకు గాను 245 మార్కులు సాధించాడు. ఫిజిక్స్ 99.72 శాతం, కెమిస్ట్రీ 99.23 శాతం, మ్యాథ్స్ 99.63 శాతం ర్యాండమ్‌గా 99.74 శాతం మార్కులతో ప్రతిభ చాటుకున్నాడు. శశాంక్ తండ్రి శ్రీనివాసరావు శ్రీరామ్ చిట్‌ఫండ్ కంపెనీలో పనిచేస్తుండగా తల్లి పద్మ ఉపాధ్యాయిని. జేఈఈ మెయిన్స్‌లో సత్తా చాటిన శశాంక్‌ను తల్లిదండ్రులతో పాటు, మిత్రులు ,గ్రామపెద్దలు అభినందించారు.

మాధవరావుకు 290/300

గజపతినగరం: మండలంలోని పురిటిపెంట మండల వారి కాలనీలో నివాసం ఉంటున్న డాకి అప్పలనాయుడు, తులసీమాధవి దంపతుల కుమారుడు మాధవరావు 2024 జేఈఈ మెయిన్స్ సెషన్ –1 ఫలితాల్లో సత్తా చాటాడు. ఈ పరీక్షల్లో 290 మార్కులు(300కు) సాధించి ఉత్తరాంధ్రలో ప్రథమ స్థానంలో నిలిచాడు. ప్రస్తుతం విశాఖపట్నంలోని నారాయణ కళాశాలలో ఇంటర్‌మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు.

విజయనగరంలో మరో ముగ్గురు..

విజయనగరం అర్బన్: ప్రతిష్టాత్మక ఐఐటీ కళాశాలల్లో ప్రవేశాలకు ఇటీవల చేపట్టిన జేఈఈ మెయిన్స్ ప్రవేశపరీక్షలో విజయనగరం విద్యార్థులు ప్రతిభ చూపారు. పట్టణంలోని వివిధ కళాశాలల్లో ఇంటర్‌మీడియట్ చదువుతున్న ధనుకొండ శ్రీనిధి 99.99 పర్సంటైల్, జంకాల చైతన్య 98.71, రొంగలి లీలా పవన్ 96.85 పర్సంటైల్ సాధించారు.

ఎస్.కోటలో సాయినాథ్

శృంవరపుకోట: పట్టణానికి చెందిన పీల షణ్ముఖ సాయినాథ్ ఓబీసీ కేటగిరిలో ఫిజిక్స్‌లో 99.77, కెమిస్ట్రీలో 99.96 మ్యాథ్స్‌లో 99.73, మొత్తంగా 99.90,78,459 పర్సంటైల్ సాధించాడు.

20 మంది గిరిజన విద్యార్థుల ప్రతిభ

సీతంపేట: సీతంపేట ఐటీడీఏ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీకాకుళం వైటీసీ సూపర్ 60 కోచింగ్ సెంటర్‌లో శిక్షణ పొందిన 20 మంది గిరిజన విద్యార్థులు జేఈఈ మెయిన్స్‌లో ప్రతిభ చాటినట్లు ఐటీడీఏ పీవో కల్పనాకుమారి, ప్రిన్సిపాల్ బి.మురళీబాబులు ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం 30 మంది ఇక్కడి నుంచి జేఈఈ మెయిన్స్‌కు హాజరయ్యారు. వారిలో కె.ఉపేంద్ర 88.98 శాతం, గేదెల చైతన్య 87.14, ఆరిక ప్రశాంత్ 83.96, సవర స్రవంతి 78.07, బిడ్డిక ఫ్రాన్సిస్ 75.79, సవర అభి 71.50 పర్సంటైల్ సాధించారు. కోచింగ్ ప్రారంభించిన ఐదునెలల్లోనే ఉత్తమ ఫలితాలు సాధించినందుకు విద్యార్థులను, ఫ్యాకల్టీ కిరణ్‌కుమార్, శ్రీకాంత్, వసంతకుమార్, ప్రభాకర్, కేర్‌టేకర్ కె.శ్రీనివాసరావు, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ రాంబాబులను పీఓ అభినందించారు.

కొత్తవలస రైల్వేస్టేషన్‌లో డీఆర్ఎం

- అభివృద్ధి పనుల పరిశీలన



కొత్తవలస రైల్వేస్టేషన్‌ను పరిశీలిస్తున్న డీఆర్ఎం సౌరభ్‌ప్రసాద్

కొత్తవలస: మండల కేంద్రంలో గల రైల్వేస్టేషన్‌ను వాల్తేర్ డీఆర్ఎం సౌరభ్‌ప్రసాద్ మంగళవారం పరిశీలించారు. అమృత్‌భారత్ పథకంలో భాగంగా చేపట్టిన పలు రకాల పనులను ఈ సందర్భంగా ఆయన పరిశీలించారు.రూ. 22కోట్లతో అదనపు ప్లాట్‌ఫామ్‌లు, ప్రయాణికులకు అనువైన సౌకర్యాల పనులు స్టేషన్‌లో చేపట్టారు.ఈ పనులను సకాలంలో నాణ్యతగా నిర్వహించాలని కాంట్రాక్టర్‌కు ఆయన సూచించారు.అనంతరం మాట్లాడుతూ కొత్తవలస రైల్వేస్టేషన్‌కు రెండో ప్రవేశ ద్వారం త్వరలోనే నిర్మిస్తామని చెప్పారు. అలాగే ఈ స్టేషన్‌లో పలు ఎక్స్‌ప్రెస్ రైళ్ల నిలుపుదల అంశం ఉన్నతాధికారుల దృష్టిలో పెట్టి చర్యలు తీసుకుంటామన్నారు. అమృతభారత్ పథకంలో చేపట్టిన పనులు ఈ నెలాఖరుకు పూర్తి చేసి ప్రారంభోత్సవం చేస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పలువురు ఇంజినీర్లు, స్టేషన్ మాస్టర్ వై.రాజు తదితరులు పాల్గొన్నారు.

105 మద్యం సీసాలతో ఒకరి అరెస్ట్



మద్యం సీసాలతో వ్యక్తిని అదుపులోకి తీసుకున్న ఏఎస్సై శ్రీనివాసరావు, పోలీసు సిబ్బంది

సీతానగరం: పోలీస్ ఉన్నతాధికారుల సూచనలమేరకు ఎస్సై ఎం. రాజేష్ ఆధ్వర్యంలో మంగళవారం సీతానగరం మండలంలోని పలుగ్రామాల రహదారుల్లో వాహనాలు, గ్రామాల్లో షాపులు తనిఖీని పోలీసులు చేపట్టారు. ఈ సందర్భంగా ఏఎస్సై జి.శ్రీనివాసరావు మాట్లాడుతూ స్థానిక శివాలయం నుంచి బూర్జ వరకూ సిబ్బంది సహకారంతో వాహనాల తనిఖీతో పాటు, కిరాణాషాపులను సోదా చేసిన సమయంలో లక్ష్మీపురంలో కిరాణాషాపు తనిఖీ చేయగా 105 మద్యం సీసాలు పట్టుబడ్డాయని చెప్పారు. అనంతరం మద్యం విక్రయాలు చేస్తున్న వ్యక్తిని గుర్తించి అదుపులోకి తీసుకున్నామన్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసి, మద్యం సీసాలను సీజ్ చేసినట్లు చెప్పారు.

రేగలో 120 మద్యం సీసాలు..

లక్కవరపుకోట: మండలంలోని రేగ గ్రామంలో కె.నారాయణ ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన 120 మద్యం సీసాలను గుర్తించి సీజ్ చేసినట్లు ఎస్సై ఆర్.గోపాలరావు మంగళవారం తెలిపారు.అజ్ఞాత వ్యక్తి ఇచ్చిన సమాచారం మేరకు గ్రామంలో తనిఖీలు నిర్వహించగా పట్టుబడిన మద్యం సీసాలను సీజ్ చేసి నిందితుడు నారాయణపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

రెండు పశువుల వాహనాల సీజ్



సీఐ చంద్రశేఖర్ పట్టుకున్న పశువుల వ్యాన్‌లు

కొత్తవలస: మండలంలోని చితలదిమ్మ సమీపంలో సీఐ వి.చంద్రశేఖర్ ఆధ్వర్యంలో పోలీసులు మంగళవారం వాహన తనిఖీలు చేస్తున్న సమయంలో అనుమతులు లేకుండా పశువులను తరలిస్తున్న రెండు వాహనాలను సీజ్ చేశారు. ఈ మేరకు సీఐ మాట్లాడుతూ ఈ పశువులను గజపతినరం ప్రాంతం నుంచి తీసుకొస్తున్నట్లు గుర్తించామని. వ్యాన్‌లలో ఉన్న 23 పశువులను స్థానిక రైతులకు అప్పగించామన్నారు. అనంతరం సంబంధిత వాహన యజమానులపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు.